
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



3 సిద్దిపేట

శుక్రవారం 18 ఏప్రిల్ 2025

సోనియా, రాహుల్‌గాంధీలపై కేసులను నిరసిస్తూ..

జగ్గారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ మహాధర్నా

సంగారెడ్డి పోస్టాఫీసు కేంద్ర కార్యాలయం వద్ద ధర్నాకు భారీగా తరలివచ్చిన కార్యకర్తలు



సంగారెడ్డిలోని పోస్టాఫీసు కేంద్ర కార్యాలయం వద్ద మహాధర్నాలో ప్రసంగిస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్

సంగారెడ్డి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెరాల్డ్ పత్రిక విషయంలో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్‌గాంధీలపై తప్పుడు కేసులు నమోదు చేశారని ఆరోపిస్తూ గురువారం సంగారెడ్డి పోస్టాఫీసు కేంద్ర కార్యాలయం వద్ద టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. బ్యానర్లు, ఫ్లెక్సీలు పట్టుకొని నిరసన తెలిపారు. జగ్గారెడ్డి పిలుపు మేరకు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు తరలివచ్చి బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మోదీ, అమిత్ షాలు కుట్రపన్నారని జగ్గారెడ్డి తీవ్రస్థాయిలో ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తోపాజి అనంతకిషన్, కూన సంతోష్, జార్జ్, కిరణ్‌గౌడ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ మహాధర్నాలో పాల్గొన్న జగ్గారెడ్డి, కార్యకర్తలు

సోనియా, రాహుల్‌పై బీజేపీ కక్ష

- రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం

హుస్నాబాద్‌రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): దేశంలో కాంగ్రెస్ బలపడుతుడడంతో రాజకీయంగా ఎదుర్కోలేక సోనియాగాంధీ, రాహుల్‌గాంధీపై బీజేపీ ప్రభుత్వం వేధింపులకు, కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. గురువారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని ఆరెపల్లి, ఎల్లమ్మచెరువు సుందరీకరణ పనులను మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. ప్రజాస్వామికంగా పరిపాలన కొనసాగించిన కాంగ్రెస్ పార్టీ నాయకత్వం అవినీతికి పాల్పడాలనుకుంటే వారి చేతిలో ఉన్న అధికారంతో ఎక్కడో ఉండేవారన్నారు. దేశ అభివృద్ధే లక్ష్యంగా పనిచేసిన గాంధీ కుటుంబం నేడు మోదీ చేతిలో కక్షసాధింపులకు గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం పూర్తిగా సీబీఐ, ఈడీల మీద ఆధారపడి ప్రభుత్వాన్ని నడుపుతోందని ఎద్దేవా చేశారు. మిత్రపక్షాలకు సంబంధించిన వాళ్లు ఎంత అవినీతి చేసినా మాట్లాడకుండా, రాజకీయంగా ప్రత్యర్థులను కక్షసాధింపు చేసే ధోరణి మంచిది కాదన్నారు. బీజేపీ అనుసరిస్తున్న విధానాలను తిప్పికొట్టేందుకు దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. మంత్రి వెంట జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మండల పార్టీ అధ్యక్షులు బంక చందు, అక్కు శ్రీనివాస్, పున్న రాజు, శ్రీధర్, తదితరులు ఉన్నారు.



హుస్నాబాద్‌లో ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులు పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కలప అక్రమంగా రవాణా చేస్తే

చట్టరీత్యా చర్యలు

- గజ్వేల్ అటవీ రేంజ్ అధికారి వినాయక్



ఫటాఫట్

గజ్వేల్, ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా కలప రవాణా చేస్తే చటరీత్యా చర్య లు తీసుకుంటామని, యంత్రాలను జప్తు చేస్తామని గజ్వేల్ రేంజ్ అటవీ అధికారి వినాయ క్ అన్నారు. గజ్వేల్ రేంజ్ పరిధిలోని అటవీ విస్తరణ, రక్షణ, మొక్కల నాటడం... తదితర అంశాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ఇంటర్వ్యూ...

రేంజ్ పరిధిలో అటవీ విస్తీర్ణం ఎంత?

గజ్వేల్ రేంజ్ పరిధిలో అటవీ విస్తీర్ణం 7386.97 హెక్టార్లు. మొత్తం అటవీ విస్తీర్ణం 10.38 శాతం అటవీ విస్తరణ ఉంటుంది.

మొత్తం అటవీ సిబ్బంది ఎంత!?

గజ్వేల్ రేంజ్ పరిధిలో 19 మంది అటవీ సిబ్బందికి గానూ 9 మంది మాత్రమే విధి నిర్వహణలో ఉన్నారు. అందులో ఎఫ్ఆర్‌వో-1, ఎఫ్‌బీవో -1, ఫారెస్ట్ సెక్షన్ అధికారి-3, ఫారెస్ట్ బీట్ అధికారి-14 పోస్టులకు గాను కేవలం 9 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు.

కట్టెకోత మిషన్లు నియమ, నిబంధనలు పాటించకపోతే ఎలాంటి చర్యలు చేపడుతారు?

కట్టెకోత మిషన్లు నియమ నిబంధనలు పాటించనట్లయితే మిషన్లు జప్తు చేయడం, జరిమానా విధించడంతోపాటు కోత మిషన్ల లైసెన్సుల రద్దుకు చర్యలు తీసుకుంటాం. అక్రమ కలప రవాణా, చెట్ల నరికివేత చేస్తే యంత్రాలను జప్తు చేయడంతో పాటు అటవీ చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

మొక్కలను నాటేందుకు తీసుకుంటున్న చర్యలు?

వచ్చే సీజన్‌లో మొక్కలు నాటేందుకు నర్సరీలో లక్షా 15వేల మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. అటవీ శాఖ ఆధ్వర్యంలో ఆరు హెక్టాలలో రైసింగ్ ప్లాంటేషన్, 40 హెక్టార్లలో ప్లాంటేషన్ నిర్వహించనున్నాం.

గతేడాది ఏమైనా కేసులు నమోదు చేశారా?

గతేడాదిలో సుమారు 30 టన్నుల కలపను స్వాధీనం చేసుకోవడంతో పాటు 11 టన్నుల కలప జప్తుచేశాం. అటవీ చట్టం ప్రకారం 47 కేసులు నమోదు చేశాం. అడవుల రక్షణ, మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత. ప్రతి ఒక్క రూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలి. భవిష్యత్తు తరానికి ప్రాణం పోయాలి.

గూడు..గోడు..!

ఇందిరమ్మ ఇళ్లు ఎవరికెన్ని?

- జిల్లావ్యాప్తంగా 2,30,483 దరఖాస్తులు
- ఎల్-1, ఎల్-2, ఎల్-3 కింద విభజన
- పైలెట్ ప్రాజెక్టు కింద 26 మండలాల్లో ప్రారంభం
- 2,667 ఇళ్లు మంజూరు
- 612 గృహాలకు శంకుస్థాపన
- బేస్‌మెంట్ లెవల్ పూర్తి చేసిన 166 మంది
- ఇటీవలే ఇద్దరికి రూ.లక్ష చొప్పున చెక్కులు అందజేసిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు
- తర్జన భర్జన పడుతున్న అధికారులు
- త్వరలోనే అర్హుల పేర్లు ప్రకటించే అవకాశం



కోహెడ మండలం పోరెడ్డిపల్లిలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులు

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, ఏప్రిల్ 16: అధికారంలోకి వస్తే గూడులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని చెప్పిన ప్రభుత్వం హామీ మేరకు కొన్నినెలల క్రితం దరఖాస్తులను స్వీకరించింది. దీంతో జిల్లావ్యాప్తంగా ఊహించని రీతిలో 2లక్షలకు పైగా దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. జిల్లాలోని నియోజకవర్గానికి 3500 చొప్పున మాత్రమే ఇళ్లను కేటాయించారు. అయితే దరఖాస్తులు ఎక్కువ రావడం, ఇళ్ల మంజూరు తక్కువగా ఉండడంతో ఏ నియోజకవర్గానికి, ఏ గ్రామానికి ఎన్ని ఇవ్వాలోనని అధికారులు తలమునకలవుతున్నారు. ఈ క్రమంలోనే తొలుత పైలెట్ ప్రాజెక్టు కింద పలు గ్రామాలను ఎంపిక చేసి నిర్మించాలని ప్రభుత్వం తలపెట్టింది. జనవరి 26న ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన జరగ్గా జిల్లాలోని 26 మండలాల్లోని 26 గ్రామ పంచాయతీల్లో 612 మంది లబ్ధిదారులు పనులు ప్రారంభించగా, అవి బేస్‌మెంట్ లెవల్‌కు చేరుకున్నాయి. మొదటి విడతలో పైలెట్ ప్రాజెక్టు కింద ఇటీవలే జిల్లాలోని ఇద్దరు లబ్ధిదారులకు రూ. లక్ష చొప్పున ప్రభుత్వం అందజేసింది.

జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం 2,30,483 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వచ్చిన దరఖాస్తుల్లో లబ్ధిదారులను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి మహిళల పేరు మీద తప్ప ఎవరికీ ఇవ్వరన్న నిబంధన మేరకు దరఖాస్తులను పరిశీలించారు. ఈ మేరకు ఎల్-1, ఎల్-2, ఎల్-3 పేరిట మూడు రకాలుగా విభజించారు. వీటిలో ఎల్-1లో లబ్ధిదారురాలు పేరు మీద ఎలాంటి ఆస్తులు, ఇళ్లు లేకపోవడం, కిరాయికి ఉన్నవారు, దారిద్ర్య రేఖకు దిగువ ఉన్నవారిని అర్హులుగా గుర్తించారు. ఎల్-2లో లబ్ధిదారుల పేరు మీద స్థలం ఉండి ఇళ్లు నిర్మించుకునేందుకు ఆర్థిక స్థోమత లేకపోవడం వంటి వారిని, ఎల్-3లో స్థలం ఉండి ఆర్థికంగా ఉన్న వారిని అనర్హులుగా గుర్తించారు. ఈ మేరకు వచ్చిన దరఖాస్తుల్లో ఎల్-1లో భాగంగా 82,320 దరఖాస్తులు రాగా వీరిలో 10,839 మంది అర్హులుగా, వివిధ కారణాలతో 71,481 మంది అనర్హులుగా అధికారులు గుర్తించారు. ఎల్-2లో 33,937 దరఖాస్తులు రాగా 4531 మంది అర్హులుగా, ఎల్-3లో 1,07,396 దరఖాస్తుల్లో ఒకటికి రెండు సార్లు పరిశీలించి 4891 మంది లబ్ధిదారులను ఎల్-2లో చేర్చనున్నారు.

గ్రామసభల్లో వస్తున్న దరఖాస్తులు

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు నిరంతర ప్రక్రియగా ప్రభుత్వం ప్రకటించడంతో గ్రామస్థాయిలో నిర్వహించిన గ్రామసభల్లో సైతం పెద్ద సంఖ్యలో వస్తున్న దరఖాస్తులను అధికారులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు జిల్లాలోని 26 మండలాల్లో గ్రామసభల నుంచి 25,847 దరఖాస్తులు వచ్చాయి. ఈ మేరకు దరఖాస్తులు పరిశీలిస్తున్న అధికారులు 4,550 మందిని అర్హులుగా గుర్తించారు. దరఖాస్తులను స్వీకరించిన అధికారులు గ్రామ పంచాయతీ కార్యదర్శి, హౌసింగ్ శాఖ, పంచాయతీరాజ్ శాఖల సమన్వయంతో అర్హులను గుర్తించేందుకు గ్రామాల్లో సర్వే చేసి అర్హుల పేర్లతో తుది నివేదికను అందజేస్తున్నారు.

మొదటి విడతగా పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాలోని 26 మండలాల్లోని 26 గ్రామ పంచాయతీల్లో ఇళ్ల నిర్మాణాన్ని లబ్ధిదారులు ప్రారంభించారు. మొత్తంగా 26 గ్రామపంచాయతీల్లో 2,667 మంది ఇళ్ల నిర్మాణానికి మంజూరవ్వగా, వీరిలో 612 మంది నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

మిగతా 6వ పేజీలో..

దుబ్బాక ఏరియా

ఆసుపత్రికి అవార్డు



దుబ్బాక ఏరియా ఆసుపత్రిలో సిబ్బందితో కలిసి కేక్ కట్ చేస్తున్న సూపరింటెండెంట్ హేమరాజ్‌సింగ్

మిరుదొడ్డి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మెరుగైన డయాలసిస్ సేవలు అందిస్తున్నందుకు దుబ్బాక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి బెస్ట్ సెంటర్ అవార్డు వచ్చినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ హేమరాజ్‌సింగ్ తెలిపారు. గురువారం ఆయన కేక్ కట్ చేసి మాట్లాడారు. దుబ్బాక ఆసుపత్రిలో 2023లో ఐదు పడకలతో డయాలసిస్ సేవలను ప్రారంభించినట్లు తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు 8200 డయాలసిస్ కేసులు చేసినట్లు తెలిపారు. అపెక్స్ కిడ్నీ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ ముంబై వారు దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సేవలను గుర్తించారని చెప్పారు. రాష్ట్రంలో దుబ్బాక ఆసుపత్రి మొదటిస్థానంలో నిలిచిందన్నారు.

జిల్లా న్యాయమూర్తుల

బదిలీ

సిద్దిపేటక్రైం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కోర్టు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.స్వాతిరెడ్డి, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్న పి.చందన బదిలీ అయ్యారు. స్వాతిరెడ్డిని సీనియర్ సివిల్ జడ్జి కమ్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌కు, చందనను ఆరవ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ హైదరాబాద్‌కు బదిలీ చేశారు. ఆమె స్థానంలో హైదరాబాద్ ఆరవ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.సంతోష్‌కుమార్‌ను నియమిస్తూ హైకోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

భూ భారతిపై అవగాహన సదస్సులు

- ఈ నెల 30 వరకు..

సిద్దిపేటకలెక్టరేట్/సిద్దిపేటఅర్బన్/నంగునూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రూపొందించిన భూ భారతి (రికార్డ్స్ ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్) చట్టం-2025 అమల్లోకి వచ్చింది. ధరణిలో లేనటువంటి పలు అంశాలను పరిష్కరించేలా కొత్త చట్టంలో నిబంధనలను రూపొందించింది. ఏ సమస్యను ఎవరు ఎన్ని రోజుల్లో పరిష్కరించాలి. అది పరిష్కారం అవ్వకుంటే ఎలా అప్పీల్‌కు వెళ్లాలనే దానిపై స్పష్టమైన మార్గదర్శకాలను విడుదల చేసింది. సీసీఎల్‌కు వెళ్లే అవకాశం లేకుండా జిల్లాస్థాయిలోనే భూ సమస్యలను పరిష్కరించుకునే విధంగా ఆర్డీవో, కలెక్టర్‌కు అధికారాలను అప్పగించింది. భూ సమస్యలన్నింటినీ పరిష్కరించే విధంగా గైడ్‌లైన్స్ విడుదల చేసిన ప్రభుత్వం వాటిని రైతులకు తెలియజేసే దిశగా ముందుకు సాగుతుంది. కొత్త చట్టం అమలుపై కలెక్టర్ మను చౌదరి ఆధ్వర్యంలో గురువారం నుంచి ఈ నెల 30 వరకు అన్ని మండలాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. తొలిరోజు జిల్లా అధికార యంత్రాంగం జిల్లాలోని నంగునూరు, సిద్దిపేట అర్బన్ మండలంలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈనెల 30 వరకు జిల్లాలోని అన్ని మండలాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు. మండలాల వారీగా ఉదయం ఒక మండలం, మధ్యాహ్నం మరో మండలంలోని రైతులకు అవగాహన కల్పించనున్నారు.

భూ భారతితో సమస్యలు పరిష్కారం

- అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

భూ సమస్యల పరిష్కారం దిశగా ధరణి స్థానంలో భూభారతి చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూపకల్పన చేసిందని, ఫలితంగా అనేక రైతు సమస్యలకు చెక్ పడే అవకాశం ఉందని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని విపంచి కళానిలయంలో భూభారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో, నంగునూరులో భూభారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో అదనపు కలెక్టర్ గరిమా, రెవెన్యూ అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌లో పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. ఆధార్ కార్డు మాదిరిగానే రైతులకు భూధార్ కార్డు ఇవ్వనున్నట్లు తెలిపారు. భూభారతి చట్టం ద్వారా అర్హులైన రైతులందరికీ న్యాయం జరుగుతుందని ఆమె తెలిపారు. వారసత్వంగా వచ్చిన భూములకు ఈ చట్టం ద్వారా మోక్షం లభిస్తుందని తెలిపారు. పలువురు రైతులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కొత్త చట్టంలో అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, సిద్దిపేట ఆర్డీవో సదానందం, డీపీవో మండల ప్రత్యేకాధికారి దేవకీదేవి, తహసీల్దార్ సరిత, ఎంపీడీవో లక్ష్మీ, సహకార సంఘం చైర్మన్లు రమేష్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

కొనుగోళ్లను అడ్డుకున్న రైతులు

- సాధారణ రకం ధరకే కొనుగోలు చేస్తున్నారని ఆగ్రహం
- సంచికి రెండు కిలోల తరుగు.. క్వింటాల్‌కు రూ.20 తగ్గిస్తున్న వైనం
- డీఎస్‌వో హామీతో ఆందోళన విరమణ

అక్కన్నపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అధికారులు, మిల్లర్లు పలు రకాల సాకులు చెబుతూ ధాన్యాన్ని సాధారణ రకం ధరకే కొనుగోలు చేస్తూ కొర్రీలు పెడుతున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం అక్కన్నపేట మండలం జనగామ ఐకేపీ కేంద్రంలో కొనగోళ్లను అడ్డుకున్నారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ రకానికి రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 మద్దతు ధర ప్రకటించింది. కొనుగోళ్లను అడ్డుకున్న విషయం తెలుసుకున్న మండల వ్యవసాయ అధికారి తస్లీమా, ఏఈవో సబిహ, ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్, సీసీ తిరుపతి కొనుగోలు కేంద్రానికి చేరుకుని ధాన్యాన్ని పరిశీలించి ఏ గ్రేడ్‌గా నిర్ధారించారు. ఏ గ్రేడ్ రకం ధాన్యాన్ని హుస్నాబాద్ మండలం పందిళ్లలో ఉన్న షణ్ముఖ మిల్లులో సాధారణ రకం ధర రూ.2,300 కే దిగుమతి చేసుకుంటున్నారని, క్వింటాల్‌కు రూ.20తో పాటు సంచికి 2 కిలోల తరుగు తీయడంతో నష్టపోతున్నామని రైతులు అధికారులను నిలదీశారు. ఈ విషయాన్ని డీఎస్‌వో తనుజాకు ఫోన్‌లో రైతులు ఫిర్యాదు చేశారు. రైతులను ఇబ్బందులు చేస్తున్న షణ్ముఖ మిల్లు పై చర్యలు తీసుకోవాలని, ఎట్లాంటి కోతలు లేకుండా ఏ గ్రేడ్ రకంకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్‌వో తనుజా రైతులతో మాట్లాడుతూ ఏ గ్రేడ్ రకం ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, ఎలాంటి కొర్రీలు లేకుండా చూస్తామని, విచారణ చేపట్టి షణ్ముఖ మిల్లుపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఇందులో మార్కెట్ మాజీ చైర్మన్ కాసర్ల అశోక్ బాబు, సింగిల్ విండో వైస్‌చైర్మన్ ఎగిడి ఐలయ్య, మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు కత్తుల శంకర్, అల్లాడి సంపత్, రైతులు పాల్గొన్నారు.



అక్కన్నపేట మండలం జనగామ ఐకేపీ కొనుగోలు కేంద్రంలో అధికారులను నిలదీస్తున్న రైతులు



సిద్దిపేట పట్టణంలో హిందూ వాహిని ఆధ్వర్యంలో ర్యాలీ

శాంతియుత ర్యాలీ

పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై, హిందూ ఆలయాలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ సిద్దిపేట జిల్లా హిందూ వాహిని ఆధ్వర్యంలో గురువారం శాంతియుత ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా హిందువాహిని సీనియర్ నాయకుడు, బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ మేక వేణుమాధవ్ మాట్లాడారు. నిరసన పేరుతో జరుగుతున్న మారణకాండను ఆపాలని, హిందువులని రక్షించాలని, మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని రద్దుచేసి రాష్ట్రపతి పాలన ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హిందూవాహిని జిల్లా అధ్యక్షుడు బసవరాజు సత్యం, ప్రధాన కార్యదర్శి బండి కిరణ్‌కుమార్, ప్రాంతాధికారులు కస్తూరి భూమిరెడ్డి, చల్ల బాల్‌రెడ్డి, జిల్లా అధికారులు పన్యాల మహేందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శ్రావణ్, ఐలయ్య, ప్రశాంత్, టౌన్ అధ్యక్షుడు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

- సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి)

240 కిలోల గంజాయి స్వాధీనం

మునిపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు వేర్వేరు చోట్ల పోలీసులు మొత్తం 240 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జహీరాబాద్ నుంచి హైదరాబాద్ వైపు ఎండు గంజాయిని గురువారం ఓ కారులో నలుగురు వ్యక్తులు తీసుకెళ్తున్నట్లు మునిపల్లి పోలీసులకు సమాచారం అందింది. దీంతో మండలంలోని కంకోల్ టోల్‌ప్లాజా వద్ద మునిపల్లి ఎస్ఐ రాజేష్ నాయక్ తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానం వచ్చి కారు ఆపి తనిఖీ చేయగా ఎండు గంజాయిని ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఎండు గంజాయిని తరలిస్తున్న వ త్సల్ రామ్ శెట్టి, ఆకాశ్ , అజయ్ దేశ్ముఖ్, సోహెల్‌లను విచారించగా కర్ణాటక రాష్ట్రం బీదర్‌లోని ఇరాని గల్లీలో కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తీసుకెళ్తున్నట్లు వారు ఒప్పుకున్నారని పోలీసులు తెలిపారు. పట్టుబడిన 130గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ నాయక్ తెలిపారు. అలాగే మరో ఘటనలో జహీరాబాద్ వైపు నుంచి ఎండు గంజాయిని బైక్‌లపై హైరాబాద్ వైపు తీసుకెళ్తుండగా కంకోల్ టోల్‌ప్లాజా వద్దే బైక్‌లను ఆపి తనిఖీ చేయగా అందులో ఎండు గంజాయి ఉన్నట్లు గుర్తించారు. బీదర్‌లోని ఇరాని గల్లీలో కొనుగోలు చేసి హైదరాబాద్ వైపు తీసుకెళ్తున్న గంజాయిని తరలిస్తున్నట్లు నిందితులు రియాజ్ పాషా, రేహాన్ గంజాయి తరలిస్తున్న నిందితుల్లో సోఫియాన్, ఆసిఫ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు 110గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ నాయక్ తెలిపారు.


పోలీసుల అదుపులో ఎండు గంజాయి తరలిస్తున్న నిందితులు

బెజ్జంకి పోలీస్ స్టేషన్‌కు గ్రహణం

● ఏ ఎస్సై వచ్చినా మూన్నాళ్ల ముచ్చటే ● కుర్చీ ఎక్కాలంటే వణుకు ● ఆరోపణలతో గడువుకు ముందే బదిలీలు

బెజ్జంకి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : బెజ్జంకి పోలీస్‌స్టేషన్‌కు అవినీతి మకిలీ అంటుకుంటుందా? ఇక్కడ పనిచేయాలంటే ఇక్కడి రాజకీయ నాయకులు, చోటామోటా నాయకులు చెప్పినట్లు వినాల్సిందేనా? అనే ప్రశ్నలకు అవుననే సమాధానం వస్తుంది. ఏళ్ల తరబడి ఇక్కడ పనిచేస్తున్న పలువురు అధికారుల పనితీరు చూస్తే చాలా మంది ఎస్సైలు గడువు ముగియకముందే అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటు బదిలీ అవడం, సస్పెండ్ అవుతుండడంతో బెజ్జంకి ఎస్సై స్థానంలోకి రావాలంటేనే జంకుతున్నారు. ప్రధానంగా ఇక్కడ ఉన్న రాజకీయ పరిస్థితులు, అక్రమ ఇసుక తరలింపు, ఇతర అక్రమ దందాలు అధికారుల మెడకు చుట్టుకుని ఇక్కడి నుంచి అవినీతి మరకలు అంటించుకుని వెళ్తున్నారు.



బెజ్జంకి పోలీసు స్టేషన్

ఎనిమిదేళ్లు ఎనిమిది మంది ఎస్సైలు

బెజ్జంకి పోలీస్ స్టేషన్‌లో ఎనిమిదేళ్ల నుంచి ఇప్పటి వరకు ఎనిమిది మంది ఎస్సైలు విధులు నిర్వహించారు. ఎస్సైలు సాధారణంగా రెండు నుంచి మూడు సంవత్సరాల వరకు ఆయా పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తుంటారు. కానీ బెజ్జంకి పోలీస్ స్టేషన్‌లో పనిచేసిన అధికారులకు పలువురు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటూ బదిలీ అవతున్నారు. ఈ ఎనిమిది మందిలో నలుగురు ఇసుకదందాను చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలతో బదిలీ కాగా, మరో ఇద్దరు ఇతర కమిషనరేట్‌లో పనిచేయాలనే ఉద్దేశంతో బదిలీపై వెళ్లారు. మరో ఎస్సై అతడి సొంత ప్రాంతమైన ఇతర కమిషనరేట్ పరిధిలో జరిగిన చిన్న వివాదంతో సస్పెండ్ అయ్యాడు. ఇక్కడి రాజకీయ నాయకులు తమకు అనుకూలంగా ఉన్న వ్యక్తులకు పోస్టింగ్‌లు ఇవ్వడంతో గతంలో పనిచేసిన అధికారుల స్థానంలో వచ్చారు. కొత్తగా బెజ్జంకి ఎస్సైగా రావాలంటే ఆలోచిస్తున్నారు.

రాజకీయ ఒత్తిళ్లతోనే ఉద్యోగం

పోలీసు అధికారిగా ఉద్యోగం అంటేనే ఒత్తిళ్లతో, సవాళ్లతో కూడుకున్నది. విధి నిర్వహణలో ఒత్తిడి కంటే రాజకీయ ఒత్తిళ్లు ఎక్కువవుతున్నాయి. అధికార పార్టీకి రాజకీయ నాయకులకు అనుగుణంగా ఉన్నవారికే పోస్టింగులు దక్కుతున్నాయి. ఆ తర్వాత సదరు నాయకులు, పార్టీకి చెందిన వారు చెప్పిన పనులు చేయాలని ఒత్తిడి తెస్తుండడంతో వారు చెప్పినట్లు చేసే క్రమంలో వివిధ ఆరోపణలు వస్తున్నాయి. అధికార పార్టీవాళ్లు తమకు అనుగుణంగా అధికారులు వ్యవహరించాలని వారిపై ఒత్తిడి తెస్తుండడంతో విధి నిర్వహణలో నిక్కచ్చిగా ఉండాలా, నాయకులు చెప్పినట్లు విని పోస్టింగ్‌ను కాపాడుకోవాలా అన్న డైలమాలో ఉంటున్నారు. ఏది ఏమైనా బెజ్జంకి పోలీస్ స్టేషన్ ఎస్సై కుర్చీలో కూర్చోవాలంటే కాస్తా ఆలోచించి రావడమే మంచిదని పలువురు అధికారులు అనుకుంటున్నారు.

షార్ట్ సర్క్యూట్ తో ఇంట్లో సామగ్రి, రూ.లక్ష నగదు దగ్ధం

అక్కన్నపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఇంట్లో సామగ్రి, రూ.లక్ష నగదు, ధాన్యం కాలిపోయింది. ఈ సంఘటన అక్కన్నపేట మండలం పంతులు తండాలో జరిగింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన బానోతు పకలియా అనే రైతు వ్యవసాయ బావి వద్దకు వెళ్లి వచ్చేసరికి మధ్యాహ్నం ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల పొగలు వస్తుండడంతో చుట్టుపక్కల వారి సహకారంతో మంటలను ఆర్పి వేశారు. రూ, 4లక్షల విలువైన సామగ్రి, రూ.లక్ష నగదు కాలిపోయినట్లు బాధితులు తెలిపారు.

గొర్రెలు, మేకల చోరీ ముఠా అరెస్ట్

వర్గల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : గొర్రెలు, మేకల దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా సభ్యులను గౌరారం పోలీసులు పట్టుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించారు. ఈ సంఘటనకు సంబంధించి గురువారం గౌరారం ఎస్సై కరుణాకర్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. హైదరాబాద్ బర్కత్‌పూర విక్రమ్‌నగర్ కాలనీకి చెందిన నీరజ్‌కుమార్ (21), కాచిగూడకు చెందిన మాఖన్ విశాల్ సింగ్ (22), రాహుల్, బాబు మొత్తం నలుగురు ఒక ముఠాగా ఏర్పడి గొర్రెలు, మేకలు దొంగతనం చేయడానికి నిర్ణయించుకున్నారు. మార్చి 24న రాత్రి హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్ లాంగ్ డ్రైవ్ కార్ వద్ద రాహుల్‌కు చెందిన ద్విచక్ర వాహనం షూరిటీపై ఉంచి సెల్ఫ్ డ్రైవ్ కారును అద్దెకు తీసుకున్నారు. నలుగురు కలిసి కారులో సిద్దిపేట వైపు వెళ్తూ మేకల దొడ్డిలు గమనించారు. మల్లారెడ్డిపల్లి గ్రామం వద్ద చీర్ల మల్లేశం మేకల దొడ్డి కనిపించడంతో అందులో నుంచి 4 మేకలను కారులో వేసుకొని హైదరాబాద్ జియాగూడ మార్కెట్లో గుర్తు తెలియని వ్యక్తులకు అమ్మేశారు. మార్చి 26న తొగుట శివారులో ప్రాంతంలోని రాంపూర్ గ్రామం వద్ద గొర్రెల దొడ్డిలో నుంచి 4 గొర్రెలను దొంగలించి హైదరాబాద్ జియా గూడ మార్కెట్లో అమ్మేశారు. గురువారం ఉదయం నీరజ్‌కుమార్, మఖన్ విశాల్ సింగ్‌ను పట్టుకుని విచారించడంతో దొంగతనం చేసినట్లు అంగికరించారు. నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్సై తెలిపారు.


దొంగల వివరాలు వెల్లడిస్తున్న గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి

అప్పుల బాధతో ఆత్మహత్య

జహీరాబాద్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ భరించలేక, జీవితంపై విరక్తిచెంది తెలుగు వెంకన్న(48) ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని అల్గోల్ గ్రామంలో గురువారం జరిగింది. అల్గోల్ గ్రామానికి చెందిన తెలుగు వెంకన్న ఎల్ఐసీ ఏజెంటుగా పనిచేస్తూ పొలంపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తెలుగువెకన్న గతంలో ఓ కంపెనీలో ఎజెంట్‌గా పనిచేశాడు. కంపనీ ఎత్తివేయడంతో పాలసీదారుల(కస్టమర్ల)కు చెల్లించాల్సిన డబ్బులు బయట వ్యక్తుల వద్ద అప్పులుతెచ్చి చెల్లించాడు. అప్పు ఇచ్చిన వారి నుంచి వేధింపులు ఎక్కువ కావడంతో గ్రామసమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వెంకన్న భార్య తుల్జమ్మ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

నకిలీ ట్రాన్స్‌జెండర్లకు దేహశుద్ధి

మనూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌జెండర్ల వేషధారణతో మాయ మంత్రాలు చేస్తామని ప్రజలకు ఇబ్బందులు కలిగించిన వారిని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన గురువారం మండల కేంద్రమైన మనూరులో జరిగింది . న్యాల్‌కల్ మండల కేంద్రానికి చెందిన తుల్జారాం,చంద్రయ్యలు చీరలు కట్టుకొని ట్రాన్స్‌జెండర్లుగా గ్రామంలోకి ప్రవేశించి పలువురిని మాయ మంత్రాలతో మీకు లాభం చేకూరుస్తామని మోసం చేసే ప్రయత్నం చేయగా గ్రామస్థులు వారిని పోలీసులకు అప్పగించారు. ఎస్సై శంకరయ్య వారిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.


ట్రాన్స్‌జెండర్ల వేషధారణలో వచ్చిన వారు

విష ఆహారం తిని పాడి ఆవులు మృతి

● ఒకేసారి మూడు చనిపోగా, రెండింటికి అస్వస్థత
● రూ.3లక్షల వరకు నష్టం

హత్నూర, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విష ఆహారం తిని మూడు పాడి ఆవులు మృతి చెందాయి. ఈ సంఘటన గురువారం ఉదయం హత్నూర మండల పరిధిలోని గుండ్లమాచునూర్ గ్రామంలో జరిగింది. ఆ గ్రామానికి చెందిన రైతు మన్నె సత్తయ్య పాడి ఆవులు, గేదెలు పెంచుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. రోజువారి మాదిరిగానే బుధవారం సాయంత్రం గ్రామ శివారులోని చెరువు సమీపంలో ఆవులు, గేదెలను మేత కోసమని తీసుకెళ్లాడు. చెరువు సమీపంలోని పోచమ్మ ఆలయం వద్ద వారం రోజుల క్రితం సినిమా షూటింగ్ నిర్వహించి, అక్కడ అమ్మవారికి నైవేద్యం సమర్పించేందుకు అన్నాన్ని కుప్పగా పోశారు. సుమారు మూడు క్వింటాళ్ల బియ్యంతో అన్నం రతిపోసి సన్నివేశాన్ని చిత్రీకరించారు. షూటింగ్ పూర్తి అయిన తర్వాత అది అలాగే వదిలేసి వెళ్లడంతో అన్నం పూర్తిగా కుళ్లిపోయి విషంగా మారినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. దాన్ని తిన్న పశువులు కొన్ని అస్వస్థతకు గురికాగా గురువారం ఉదయం అందులో మూడు పాడి ఆవులు మృతి చెందాయి. మరో రెండు అస్వస్థతకు గురై ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితిలో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశాడు. అస్వస్థతకు గురైన గేదెలు, ఆవులను పశుసంవర్ధక శాఖ అధికారులు పరిశీలించి అవసరమైన టీకాలు వేశారు. పాడి ఆవుల మృతితో సుమారు మూడు లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు రైతు సత్తయ్య తెలిపారు. ప్రభుత్వం ఆదుకొని న్యాయం చేయాలని కోరారు.

భార్యలు దూరమయ్యారని భర్త ఆత్మహత్య

రామచంద్రాపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): భార్యలు దూరమయ్యారని ఓ భర్త గురువారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నాడు. అస్సాంకు చెందిన బిశాల్(30) కొల్లూరులోని సిగ్నిచర్ అపార్టుమెంట్ల వద్ద ఉన్న కార్ వాషింగ్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. ఇతనికి ఇద్దరు భార్యలు. పెద్ద భార్యకు ఒక కుమారుడు ఉన్నాడు. బిశాల్ తరుచూ భార్యతో గొడవపడటం, తిట్టడం, కొట్టడంతో ఆమె భర్తను విడిచి కొడుకుతో తన పుట్టింటికి వెళ్లిపోయింది. ఆ తరువాత నందిగామకు చెందిన మరో యువతిని పెళ్లి చేసుకున్నాడు. ఆమె పట్లకూడ మొదటి భార్య విషయంలో వ్యవరించినట్లు వ్యవరించేవాడు. ఆమె కూడా భర్తను విడిచిపెట్టి వెళ్లిపోయింది. దీంతో తీవ్రమైన మనస్థాపం చెందిన బిశాల్ గురువారం ఉదయం కారు వాష్ సెంటర్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డాడని సీఐ తెలిపారు. భార్యలకు సమాచారం అందించిన పోలీసులు సాయంత్రం వరకు వేచి చూశారు. చివరకు తోటి కూలీ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యం ట్రాక్టర్ బోల్తా .. ఒకరు మృతి

● ఇరువురికి గాయాలు

నారాయణఖేడ్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువెళ్తుండగా ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడడంతో ఒకరు మృతి చెందగా ఇరువురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం ఉదయం ఖేడ్ పరిధిలో జరిగింది. నిజాంపేట మండలం శాఖాపూర్‌కు చెందిన గడ్డమీది అశోక్(35)తన పొలంలో పండిన ధాన్యాన్ని నిజాంపేటలోని కొనుగోలు కేంద్రంలో విక్రయించడానికి ట్రాక్టర్‌పై తీసుకువెళ్తుండగా, అదుపుతప్పడంతో బోల్తా పడిందని స్థానికులు తెలిపారు. దీంతో అశోక్, ఇంజన్‌లో చిక్కుకొని అక్కడికక్కడే మృతి చెందాడు. అశోక్‌కి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ట్రాక్టర్‌పై నలుగురు ఉండగా బీర్ల లక్ష్మయ్య, బీరయ్యలకు తీవ్రమైన గాయాలు, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. అశోక్ భార్య సవిత ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నారాయణ ఖేడ్ ఎస్సై విద్యాచరణ్‌రెడ్డి తెలిపారు.


గడ్డమీది అశోక్(ఫైల్)

వాటర్ ట్యాంకర్ ఢీకొని బాలుడికి గాయాలు

గుమ్మడిదల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామిక వాడలోని వీరన్న గూడెంలో బుధవారం ఓ బాలుడు ట్యాంకర్ ట్రాక్టర్ కింద పడి తీవ్రమైన గాయాల పాలైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం బీహార్‌కు చెందిన బాలుడు బుధవారం రాత్రి 8 గంటలకు వీరన్నగూడెం వీధిలో ఆడుకుంటున్నాడు. వీరన్న గూడెం నుంచి ఓ వాటర్ ట్యాంకర్ డ్రైవర్ మద్యం మత్తులో ఆడుకుంటున్న బాలుడిని ఢీకొనడంతో తీవ్రమైన గాయాలు పాలయ్యాడు. బాలుడి కుడికాలు విరగడంతో హైదరాబాదులోని సూరారం మల్లారెడ్డి ఆసుపత్రికి తీసుకెళ్లి కుటుంబ సభ్యులు చికిత్స చేయిస్తున్నారు. అయితే మండలంలో బోర్ల నుంచి నీటిని తోడి పరిశ్రమలకు అక్రమంగా తలిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రమాదం జరిగినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

కెమికల్ పరిశ్రమలో అగ్నిప్రమాదం

పటాన్‌చెరు రూరల్, ఏప్రియల్ 17 (ఆంధ్రజ్యోతి) : పాషమైలారంలోని ఓ కెమికల్ పరిశ్రమంలో గురువారం అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదు కానీ భారీ స్థాయిలో ఆస్తినష్టం వాటిల్లింది. పరిశ్రమ ప్లాంట్‌లో సాల్వెంట్స్ వద్ద ఫైరింగ్ రావడంతో మంటలు ఎగబాకి రియాక్టర్ పేలడంతో ఈ ప్రమాదం జరిగినట్లు పలువురు కార్మికులు తెలిపారు. సమాచారం అందుకున్న పటాన్‌చెరు ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. బీడీఎల్ సీఐ స్వామి గౌడ్ తన సిబ్బందితో పరిశ్రమకు చేరుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకున్నారు.

ట్రాక్టర్ ఢీ కొని వ్యక్తి మృతి

అక్కన్నపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన అక్కన్నపేట మండలం కట్కూరు గ్రామ శివారులో బుధవారం రాత్రి జరిగింది. మండలంలోని గొల్లకుంటకు చెందిన గూడూరు మల్లేష్(70) అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై గొల్లకుంటకు వెళ్తుండగా కట్కూరు శివారులో వెనకనుంచి వేగంగా వచ్చిన ట్రాక్టర్ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. మల్లేష్‌కి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. చిన్న కుమారుడు అజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



కాంగ్రెస్ నిరసనలో నీలం మధు

పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసన కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి నీలం మధు ముదిరాజ్ పాల్గొన్నారు. నేషనల్ హెరాల్డ్ విషయంలో కక్షపూరితంగా వ్యవహరిస్తూ సోనియాగాంధీ రాహుల్‌గాంధీ పేర్లను చార్జిషీట్‌లో చేర్చడాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

● అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ


తెలుగు డైరీని ఆవిష్కరిస్తున్న అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ ఉపేంద్రశర్మ

చేర్యాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధితో పాటు అర్చక ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ కృషి చేస్తున్నారని రాష్ట్ర దేవాదాయశాఖ అర్చక, ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ అన్నారు. కొమురవెల్లి మల్లన్న ఆలయ గెస్ట్‌హౌజ్‌లో గురువారం తెలుగు డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 15 నుంచి రాష్ట్రంలో సరస్వతీ పుష్కరాలు జరగనున్నాయని, అందుకు కాళేశ్వర ముక్తేశ్వర ఆలయ ప్రాంతంలో వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, ప్రధాన అర్చకుడు మహదేవుని మల్లికార్జున్, వీరశైవాగమ పాఠశాల అధ్యాపకుడు వీరేశ లింగం, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

మామిడీలా

పడిపోయిన దిగుబడి

గతేడాది కంటే పెరిగిన రేటు

టన్నుకు రూ. 70వేల వరకు పలికిన ధర

కాత లేకపోవడంతో రైతులకు తప్పని నష్టం

హుస్నాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : వర్షాభావ పరిస్థితులతో మామిడితోటలను పెంచే మెట్టప్రాంత రైతులు ఈసారి నష్టాలను చవి చూస్తున్నారు. పూర్తిగా దిగుబడి తగ్గిపోవడంతో పెట్టిన పెట్టుబడులు రాని పరిస్థితి ఏర్పడింది. మొదట్లో పూత ఆశించిన మేరకు ఉన్నా తదుపరి వాతావరణ పరిస్థితుల ప్రభావంతో చెట్లకు కాయలు లేకుండా పోయాయి. మార్కెట్‌లో ధర బాగానే ఉన్న దిగుబడి లేక రైతులు కుదేలవుతున్నారు.


హుస్నాబాద్ నుంచి రవాణా చేస్తున్న మామిడికాయలు

3,340 ఎకరాల్లో

హుస్నాబాద్ డివిజన్‌లో దాదాపు 3,340 ఎకరాలకుపైగా మామిడి తోటలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో బంగినిపల్లి, దశరి, కోత మామిడి తోటలు ఉన్నాయి. డివిజన్‌లోని అక్కన్నపేట మండలంలో 964.33 ఎకరాలు, హుస్నాబాద్ మండలంలో 712.06 ఎకరాలు, కోహెడ మండలంలో 1315.06 ఎకరాలు, బెజ్జంకి మండలంలో 349.20 ఎకరాలు మొత్తం 3,340.53 ఎకరాల్లో తోటలున్నాయి. ప్రతి ఏటా ప్రకృతి వైపరీత్యాల వల్ల మామిడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గతేడాది పూత వచ్చి కాత నిలిస్తే వడగండ్ల వానలతో దెబ్బతినడమే కాకుండా ధర కూడా లేకపోవడంతో నష్టాల బారిన పడ్డారు. ఈ సారి పూత వచ్చినా మారిన వాతావరణ పరిస్థితులతో రాలిపోవడంతో మళ్లీ నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. దీనికి తోడు తామెర పురుగు వల్ల మామిడి కాత అనుకున్నంతగా రాలేదు.

ఈసారి టన్నుకు రెట్టింపు ధర

మామిడి ధర టన్నుకు గతేడాది కంటే రెట్టింపు పలుకుతున్నది. అయితే, దిగుబడి పూర్తిగా తగ్గడంతో రైతులకు నష్టాలు తప్పడం లేదు. ఆరు ఎకరాల మామిడి తోటలో కేవలం మూడు టన్నుల కాత కూడా రాలేదని రైతులు పేర్కొంటున్నారు. గతేడాది టన్ను ధర రూ.35 నుంచి 40 వేల వరకే ఉన్నా ఈసారి వరంగల్, కరీంనగర్, హుస్నాబాద్ మార్కెట్‌లో 60 నుంచి రూ.75 వేల వరకు ధర ఉందని, ఐదు రోజుల క్రితం కరీంనగర్ మార్కెట్‌లో రూ.90 వేలు కూడా ధర పలికినట్లు రైతులు పేర్కొంటున్నారు. హుస్నాబాద్ డివిజన్ నుంచి మామిడి కమీషన్ ఏజెంట్ గతేడాది 800 టన్నుల వరకు కొనుగోలు చేయగా ఈసారి 300 టన్నులు కూడా వచ్చే పరిస్థితి లేదని పేర్కొంటున్నారు.

హుస్నాబాద్ కొనుగోలు కేంద్రంలో మామిడి కాయలు


వివిధ రాష్ట్రాలకు ఎగుమతి

హుస్నాబాద్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఓ మామిడి కమీషన్ ఏజెంట్ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కొద్ది, గొప్పో కాసిన మామిడి కాయలను రైతులు కరీంనగర్, వరంగల్ మార్కెట్‌లతో పాటు ఇక్కడ కూడా విక్రయిస్తున్నారు. హుస్నాబాద్ ప్రాంతంలో కొనుగోలు చేసిన మామిడి కాయలను ఇక్కడి నుంచి ప్యాక్ చేసి వివిధ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ముఖ్యంగా ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, హర్యానా, పంజాబ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు పంపిస్తున్నారు.


హుస్నాబాద్‌లో కాత లేని మామిడి తోట

ఈసారి 300 టన్నులు కూడా వచ్చే పరిస్థితి లేదు

ఐదు సంవత్సరాల నుంచి హుస్నాబాద్‌లో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి మామిడిని మే నెల చివరి వరకు కొనుగోలు చేస్తున్నాం. గత సంవత్సరం దాదాపు 800 టన్నుల వరకు కొనుగోలు చేశాం. ఈసారి 300 టన్ను కూడా వచ్చే పరిస్థితి కనబడటం లేదు. ఇప్పటివరకు 10 టన్నులు మాత్రమే కొనుగోలు చేశామంటే కాత ఎంత తగ్గిందో అర్థం చేసుకోవచ్చు. కానీ, గతేడాది కంటే ఈసారి ధర ఎక్కువగానే ఉన్నది.

\- గురాల సందీప్, మామిడి కమీషన్ ఏజెంట్

ఆరు ఎకరాల తోటకు రెండు టన్నుల కాత లేదు



నాకు ఆరు ఎకరాల మామిడి తోట ఉన్నది. ఈసారి రెండు టన్నుల ఖాత కాయలేదు. మొదట్లో పూత వచ్చింది. మారిన వాతవరణంతో ఖాత లేకుంటా పోయింది. ఇంకా కాయ తెంపలేదు. ఏడాదంతా పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు. పోయినసారి వడగండ్ల వర్షాలతో కాయ రాలిపోయింది. ఈసారి వాతావరణ పరిస్థితులతో కాయ రాకుండా పోయింది.

\- జనగామ నర్సింగరావు, మామిడి రైతు హుస్నాబాద్

మెడికల్ కాలేజీల్లో ఫేస్ రికగ్నిషన్ హాజరు

మే 1 నుంచి అమలుకు ఎన్‌ఎంసీ నిర్ణయం

ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీలకు వర్తింపు

ఇక బయోమెట్రిక్ హాజరుకు స్వస్తి

కొత్త విధానంతో డుమ్మా, నకిలీ డాక్టర్లకు చెక్

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో మే 1 నుంచి ఫేస్ రికగ్నిషన్(ముఖ ఆధారిత గుర్తింపు)తో హాజరు నమోదు చేసే విధానాన్ని ప్రవేశపెట్టేందుకు జాతీయ వైద్య మండలి(ఎన్‌ఎంసీ) నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆధార్ ఆధారిత ఫేస్ రికగ్నిషన్ హాజరు విధానంతో ఇక బయోమెట్రిక్ విధానానికి స్వస్తి పలకనున్నారు.

సంగారెడ్డి జిల్లాలో నాలుగు కళాశాలలు

సంగారెడ్డి జిల్లాలో నాలుగు మెడికల్ కాలేజీలున్నాయి. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఉండగా, పసల్‌వాది, ఇస్నాపూర్, ఇంద్రేశంలో ఒక్కొటి చొప్పున ప్రైవేటు మెడికల్ కాలేజీలున్నాయి. సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో 27 మంది ప్రొఫెసర్లు, 34 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 61 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 32 మంది సీనియర్ రెసిడెంట్లు, 24 మంది కాంట్రాక్టు ప్యాకల్టీ ఉన్నారు. ఇక మూడు ప్రైవేటు కాలేజీల్లో కలిపి వివిధ హోదాల్లో సుమారు 150 మంది వరకు ప్యాకల్టీ పనిచేస్తున్నట్టు అధికారులు తెలిపారు.



సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల

కళాశాల, ఆస్పత్రిలో ఉంటేనే హాజరు

ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీలతో పాటు అనుబంధ ఆస్పత్రుల్లో విధులు నిర్వర్తించే డాక్టర్ల హాజరును ఇక నుంచి ఫేస్ రికగ్నిషన్ ద్వారా నమోదు చేస్తారు. ఫోన్‌లోని ప్రత్యేక యాప్ ద్వారా హాజరు నమోదు చేసుకుంటారు. కళాశాల, ఆస్పత్రి ఉన్న ప్రాంతాన్ని అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా నమోదు చేస్తారు. సదరు డాక్టర్.. కళాశాల, ఆస్పత్రిలో ఉంటేనే హాజరు నమోదు అవుతుంది. లేకపోతే హాజరు నమోదు కాదు. కాగా ఫేస్ రికగ్నిషన్ హాజరు నమోదు కోసం ఒకట్రెండు రోజుల్లో ఆయా మెడికల్ కళాశాల, ఆస్పత్రుల్లో పనిచేసే డాక్టర్ల పూర్తి వివరాలను ఎన్‌ఎంసీ సేకరించనున్నది.

సరికొత్త విధానంతో డుమ్మాలకు చెక్

ఎన్‌ఎంసీ తీసుకురానున్న కొత్త విధానంతో మెడికల్ కాలేజీలు, ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యుల డుమ్మాలు, నకిలీలకు చెక్ పడనుంది. బయోమెట్రిక్ హాజరు ఉన్నప్పటికీ పలువురు సక్రమంగా హాజరుకాకపోవడం, మరికొందరు సొంతంగా ప్రైవేటు ప్రాక్టిస్ చేసుకుంటూ విధులకు ఎగనామం పెడుతున్నారే ఆరోపణలున్నాయి. వాస్తవానికి ఉదయం 9 గంటలకు మళ్లీ సాయంత్రం 4 గంటలకు బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలనే నిబంధనలను పలువురు ఖాతరు చేయడం లేదు. ఇటీవల సంగారెడ్డి కలెక్టర్ జీజీహెచ్‌ను సందర్శించిన క్రమంలో ఈ విషయం వెలుగులోకి రావడంతో 17 మందికి మెమోలు జారీ చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఎన్‌ఎంసీ తీసుకున్న నిర్ణయంతో డాక్టర్లు రెగ్యులర్‌గా వచ్చి మెడికోలకు బోధనతో పాటు ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించే అవకాశం ఏర్పడనుందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

ప్రమాదకరంగా రేడియల్ రోడ్డు ఎక్స్‌టెన్షన్-30

రామచంద్రాపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్)ను కలుపుతూ రామచంద్రాపురం మండల పరిధిలో నిర్మిస్తున్న రేడియల్ ఎక్స్‌టెన్షన్-30 రోడ్డు ప్రమాదకరంగా మారింది. గోపన్‌పల్లిలోని విప్రో సర్కిల్ నుంచి తెల్లాపూర్, ఉస్మాన్‌నగర్ మీదుగా కొల్లూరు ఓఆర్ఆర్ వరకు ఉన్న రోడ్డు అనేక మలుపులు, వంపులతో యాక్సిడెంటల్ స్పాట్‌లను తలపిస్తున్నాయి. నాలుగు రోజుల క్రితం ఉస్మాన్‌నగర్ రోడ్డులోని రాజ్‌పుష్ప మలుపు వద్ద ఓ టిప్పర్ బైక్‌ను ఓవర్ టేక్ చేసే క్రమంలో బైక్‌పైనుంచి వెళ్లడంతో ఓ వ్యక్తి నుజ్జునుజ్జయి దుర్మరణం పాలయ్యాడు. ఇటీవల ఈ రోడ్డులో అనేక ప్రమాదాలు చోటుచేసుకోగా ఎనిమిది మంది మృత్యువాత పడ్డారు.

మృత్యుదారిగా 'జడ్' మూలమలుపు

ఈ ప్రాంతంలో విల్లాలు, అపార్ట్‌మెంట్‌లు ఎక్కువ కావడంతో జనసంచారం బాగా పెరిగింది. వాహనాల రద్దీ ఎక్కువైంది. తెల్లాపూర్‌లోని మైహోమ్ సయాక్ అపార్ట్‌మెంట్ దాటాక వచ్చే మలుపు, తర్వాత ఆకృతి సీఆర్‌పీ విల్లాస్ వద్ద మలుపు, హెచ్‌పీ పెట్రోల్ పంపు వద్ద, ఏఆర్‌పీ వైవా విల్లాల నుంచి రాజ్‌పుష్ప వరకు జడ్ ఆకారంలోని మలుపు, ఉస్మాన్‌నగర్ శివాలయం వద్ద మలుపు యాక్సిడెంట్ స్పాట్‌లుగా మారాయి. ఈ దారిలో ప్రమాదకర జడ్ ఆకారం మలుపు వద్ద అసలే వాహనదారులు భయభయంగా వెళుతుంటే రోడ్డు పక్కన నిర్మించిన ట్రాఫిక్ ఐలాండ్ మరింత ఇబ్బందికరంగా మారిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణంగా రోడ్డు విభాగిని మధ్యలో, చౌరాస్తాలలో ఏర్పాటు చేయాల్సిన ట్రాఫిక్ ఐలాండ్‌ను రహదారి పక్కన ఏర్పాటు చేయడంపై అటు వైపు నుంచే వెళ్లే వాహనదారులు మండిపడుతున్నారు. బైక్‌ను ఓవర్ టేక్ చేస్తూ టిప్పర్ దానిపై నుంచి వెళ్లిన ప్రమాదంతో కొల్లూరు పోలీసులు మేల్కొన్నారు. వెంటనే ఈ మలుపు వద్ద బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను కూడ నియమించారు. అయితే, మలుపు వద్ద రోడ్డును మరింత విస్తరించేందుకు ట్రాఫిక్ ఐలాండ్ తొలగించాలని వాహనదారులో కోరుతున్నారు. తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి మాత్రం కలెక్టర్ వల్లూరు క్రాంతి రోడ్డు ప్రమాదంపై అధికారులతో సమీక్షించారని, ఇక్కడ స్పీడ్ బ్రేక్‌లు వేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని తెలిపారని చెబుతున్నారు.


రేడియల్ రోడ్డుకు పక్కన నిర్మించిన ట్రాఫిక్ ఐలాండ్

వక్ఫ్ చట్టం రద్దయ్యే వరకు పోరాటం ఆగదు

- రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తున్న చట్టం
- ముస్లిం జేఏసీ సభ్యులు అబ్దుల్ షమీ
- ముస్లిం పర్సనల్ లా బోర్డు సూచనలతో సిద్దిపేట ముస్లిం జేఏసీ ఏర్పాటు
- మూడు నెలల శాంతియుత పోరాటాలకు పిలుపు

సిద్దిపేట కలెక్టరేట్ ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ చట్టం రద్దు అయ్యే వరకు ముస్లింల పోరాటం ఆగదని సిద్దిపేట ముస్లిం జేఏసీ సభ్యులు అబ్దుల్ షమీ, ముఫ్తీ కరీముద్దీన్ పటేల్ తెలిపారు. గురువారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ముస్లింల అస్తిత్వాన్ని దెబ్బ తీసేవిధంగా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ బిల్లును వెంటనే రద్దు చేయాలన్నారు. ఈ చట్టం రాజ్యాంగం కల్పిస్తున్న హక్కులను కాలరాస్తుందని మండిపడ్డారు. ఫాసిస్ట్ బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి మైనారిటీలపై దౌర్జన్యాలు పెరిగిపోయాన్నారు. దేశంలో 25 శాతం ఉన్న మైనారిటీల హక్కులను కాల రాయడానికి కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నల్ల చట్టం రద్దు చేయాలన్నారు. ముస్లిం పర్సనల్ లా బోర్డు సూచన మేరకు శాంతియుత నిరసనలు తెలుపడానికి సిద్దిపేట ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో దాదాపు 12 సామాజిక, ఉలేమాల సంస్థలు, బీఆర్ఎస్, కాంగ్రెస్, మిగతా రాజకీయ పార్టీ నాయకులతో కలిపి ముస్లిం జేఏసీ ఏర్పాటు చేశామని జేఏసీ పెద్దలు అబ్దుల్ షమీ తెలిపారు. మూడు నెలల పాటు ప్రతీ శుక్రవారం మసీద్‌ల వద్ద శాంతియుత నిరసనలు తెలుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట తంజీమ్ సుప్రీం బాడీ అధ్యక్షుడు జుబెర్ హుస్సేన్, జమైతే ఇస్లామీ హింద్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ ఖుద్దూస్, కౌన్సిలర్లు అబ్దుల్ మొయిజ్, అర్షద్, గౌస్ మోహినొద్దీన్, ఫక్రుద్దీన్ పలువురు నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ముస్లిం జేఏసీ నాయకులు



వర్గల్‌లో ప్రారంభానికి నోచుకోని గ్రంథాలయం

కళ తప్పిన గ్రంథాలయాలు

పాఠకులు లేక వెలవెల.. డిజిటల్ లైబ్రరీల ఏర్పాటుతో ఆసక్తి పెంచే అవకాశం


గ్రామపంచాయతీ భవనంలోని రూంలో కొనసాగుతున్న జగదేవ్‌పూర్ గ్రంథాలయం

గజ్వేల్/ గజ్వేల్ డివిజన్ బృందం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గతంలో పాఠకులతో కళకళలాడిన గ్రంథాలయాలు నేడు వెలవెలబోతున్నాయి. చేతిలో మొబైల్ ఫోన్లను పట్టుకుంటున్న యువత, పెద్దలు గ్రంథాలయాల వైపు చూడడమే లేదు. మారుతున్న సమాజానికి అనుగుణంగా గ్రంథాలయాల్లో మార్పులు చోటు చేసుకోకపోవడంతో లైబ్రరీల వైపు చూసే నాథులే కరువయ్యారు. కేవలం గజ్వేల్ పట్టణంలోని గ్రంథాలయంలో మాత్రమే పాఠకుల తాకిడి ఉండగా, మిగతా గ్రంథాలయాల పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. గతంలో దినపత్రికల కోసం ఎదురుచూసే ప్రజలు ప్రస్తుతం చదవడం కోసం కూడా రావడం లేదు. చేతిలోని ఫోన్‌లోనే ఈ-పేపర్‌లు వస్తుండడంతో అందులోనే చదువుతున్నారు. కేవలం కాంపిటేటివ్ పరీక్షలు ఉన్నప్పుడు మాత్రమే ఆసక్తి ఉన్న అభ్యర్థులు గ్రంథాలయాలకు చేరుకుని చదువుకుంటున్నారు. గజ్వేల్ పట్టణంలోని శాఖ గ్రంథాలయం పాత నగర పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. కొండపాక మండల కేంద్రంలో అన్ని వసతులు ఉన్నా పాఠకుల సంఖ్య భారీగా తగ్గింది. వర్గల్ మండల కేంద్రంలో గ్రంథాలయం శిథిలావస్థకు చేరుకోగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం కొనసాగుతుంది. గ్రామానికి దూరంగా ఉండడంతో చదవడానికి ఆసక్తి ఉన్న వారు వెళ్లడానికి ఇష్టపడడం లేదు. వర్గల్‌లో గ్రామ నడిబొడ్డున గ్రంథాలయాన్ని నిర్మించినప్పటికీ ప్రారంభం కాకపోవడంతో అందుబాటులోకి రాలేదు. ఈ భవనానికి సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో కాంట్రాక్టర్ భవనాన్ని అప్పగించలేదని తెలుస్తుంది. జగదేవ్‌పూర్ మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామ పంచాయతీ ఆవరణలో ఉన్న గదిలో నడిపిస్తున్నారు. ప్రస్తుతం సాధారణ గ్రంథాలయాలు ఉన్నప్పటికి డిజిటల్ లైబ్రరీలను ఏర్పాటు చేస్తేనే పాఠకులకు ఆసక్తి ఉంటుందని పలువురు పుస్తకాల ప్రేమికులు చెబుతున్నారు.

ముగిసిన టెక్నో ఫెస్ట్

చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజులుగా జరుగుతున్న టెక్నో ఫెస్ట్ 2కె25 ఉత్సవాలు గురువారం ముగిసాయి. ఈ ముగింపు కార్యక్రమానికి జేఎన్టీయూ వైస్ చాన్సలర్ టి.కిషన్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన ఈ సందర్భంగా సైకిల్‌స్టాండ్‌ను ప్రారంభించి కళాశాలకు మంజూరైన 100 సైకిళ్లను రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావుతో కలిసి విద్యార్థులకు అందజేశారు.

\- పుల్‌కల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి)




వీపుపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రం

రజతోత్సవ అభిమానం

చేర్యాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ముస్త్యాల గ్రామానికి చెందిన ఓ ఆటో డ్రైవర్ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై అభిమానం చాటుకున్నాడు. వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27న జరగనున్న రజతోత్సవ సభ నేపథ్యంలో ఆటో డ్రైవర్ పండుగ బాబు తన వీపుపై కేసీఆర్ చిత్రపటం వేయించుకోవడంతో పాటు ఛాతీ, పొట్టపై ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి పేరు, కారుబొమ్మ వేయించుకుని, సారే మళ్లీ రావాలని ఆకాంక్షిస్తూ ప్రచారం చేశాడు.


పెయిటింగ్ వేసుకుని ప్రచారం చేస్తున్న ఆటో డ్రైవర్ పండుగబాబు

అక్రమ ఇసుక డంప్ సీజ్

చేర్యాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా డంప్ చేసిన ఇసుకను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. మండలం వేచరేణి గ్రామ శివారులోని వాగు ఒర్రె సమీపంలో సుమారు 100 ట్రిప్పుల ఇసుకను అక్రమంగా నిల్వ చేశారన్న సమాచారం మేరకు గురువారం తహసీల్దార్ మొహ్మద్ సమీర్ అహ్మద్‌ఖాన్, ఆర్ఐ రాజేందర్‌రెడ్డి పరిశీలించి సీజ్ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే గుణాత్మక విద్య



ముందస్తు బడిబాట కరపత్రం ఆవిష్కరిస్తున్న దృశ్యం

చేర్యాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే గుణాత్మక విద్య అందుతుందని మాజీ ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్, ఎంఈవో రచ్చ కిష్టయ్య అన్నారు. చేర్యాల మండలం నాగపురి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం హెచ్ఎం పిస్నింటి మల్లికార్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో ముందస్తు బడిబాట కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో డిజిటల్, నాణ్యమైన బోధన జరుగుతుందన్నారు. ప్రైవేటు మాయలో పడి మోసపోకూడదని, ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకుందామన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 23 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం/చేర్యాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ తన సిబ్బందితో కొన్ని రోజుల క్రితం సిద్దిపేట పట్టణంలో నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తా, రాజీవ్ రహదారిపై వాహనాలు తనిఖీ నిర్వహించారు. 11 మంది వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుబడగా గురువారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ముందు హాజరుపరిచారు. విచారణ చేపట్టి 11 మందికి రూ.24000 జరిమానా విధించారు. అలాగే డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన 12మందిని విచారించిన చేర్యాల మున్సిఫ్‌కోర్టు ఇన్‌చార్జి జడ్జి కృష్ణతేజ్ గురువారం రూ.51,500 జరిమానా విధించారు.

కరాటేలో ప్రతిభ చాటిన వారికి బెల్టులు

కొండపాక, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కరాటేలో ప్రతిభ కనబరిచిన పిల్లలకు గురువారం బెల్ట్‌ల ప్రదానం చేశారు. కొండపాక మండలం ఉన్నత పాఠశాల ఆవరణలో కరాటే గ్రేడింగ్ టెస్టులు నిర్వహించారు. కరాటే మాస్టర్ బ్లాక్ బెల్ట్ ఫిఫ్త్ డాన్ తిరుపతి నర్సింహులు ఆధ్వర్యంలో జరిగిన ఈ గ్రేడింగ్ టెస్ట్‌లో ఎం.డి సోయల్ , ఏ. గౌరీ ప్రసాద్ లు బ్రౌన్ బెల్టు కైవసం చేసుకోగా, కరాటే లో శిక్షణ పొందిన మరో 10 మంది ఎల్లో, ఆరెంజ్, గ్రీన్, బ్లూ, మెరూన్ బెల్టులను అందుకున్నారు. కరాటేలో నైపుణ్యాన్ని ప్రదర్శించిన విద్యార్థులకు బీఆర్ఎస్ నాయకురాలు మానస బెల్టులను ప్రదానం చేశారు.

పెన్షన్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి : టీపీటీఎఫ్

గజ్వేల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్ డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో గజ్వేల్ జోన్ కన్వీనర్ శ్రీనివాస్ అధ్యక్షతన జూపల్లి రాంరెడ్డి పదవీ విరమణ అభినందన సభ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇటీవల కేంద్రం పార్లమెంట్ సభ్యుల పారితోషికాలను ఎటువంటి చర్చలు జరపకుండా పెంచారని, 35 నుంచి 40 ఏళ్ల పాటు ప్రజలను అనేక సేవలందించిన పెన్షనర్లకు మాత్రం పెన్షన్ రివిజన్స్ ఎగనామం పెట్టడానికి బిల్లును ఆమోదించడం అన్యాయమన్నారు. రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రాంచంద్రం, రాష్ట్ర కౌన్సిలర్ రాజులు, జిల్లా ఉపాధ్యక్షులు పాపిరెడ్డి, జిల్లా కార్యదర్శి మంజుల, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సైదులు, సుగుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

రేబర్తిలో హీమోఫిలియా దినోత్సవం

మద్దూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబర్తి గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో హిమోఫిలియా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి స్టువర్డ్‌సన్ హిమోఫిలియోపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. హిమోఫిలియా అనేది ఒక జన్యుపరమైన వ్యాధి అని, వంశపారంపర్యంగా సంభవిస్తుందన్నారు. ఏదైనా గాయం అయినప్పుడు రక్తం గడ్డ కట్టదన్నారు. తీవ్ర రక్త స్రావం మూలంగా అది ప్రాణాంతకం కావొచ్చన్నారు. దీనికి రీప్లేస్‌మెంట్ థెరపీ చికిత్సను అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ మాధవ్ జాదవ్, ఏఎన్ఎం మల్‌హోత్రి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

బెజ్జంకి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): బెజ్జంకి మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీని గురువారం ఆలయ అధికారులు లెక్కించారు. 25 రోజుల ఆలయ హుండీ లెక్కింపులో భాగంగా హుండీ ఆదాయం 4,80,276 రూపాయలు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. హుండీతో కలుపుకొని జాతర ఆదాయం 14,09,990 రూపాయలను బ్యాంకులో జమ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్స్పెక్టర్ విజయలక్ష్మీ, ఈవో విశ్వనాథ శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ ప్రభాకర్, ఆలయ అర్చకుడు మధు సూదనా చార్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రామరాజు నిరంతర రామసేవ అమోఘం

● అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రియాంక



గజ్వేల్ జడ్జి ప్రియాంకకు తలంబ్రాలు అందిస్తున్న రామకోటి రామరాజు

గజ్వేల్ రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రామకోటి రామరాజు నిరంతర రామ సేవ అమోఘమని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రియాంక అన్నారు. ఈ నెల 22న జరిగే సీతారామ, ఉమా మహేశ్వరుల కల్యాణానికి గోటి తలంబ్రాలు అందించాలని సంస్థ అధ్యక్షుడు రామకోటి రామరాజు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా గురువారం అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రియాంక గోటి తలంబ్రాల కార్యక్రమంలో పాల్గొని రామ నామ స్మరణ చేస్తూ వడ్లను ఒలిచి తలంబ్రాలుగా చేసి రామకోటి రామరాజుకి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ గోటి తలంబ్రాల్లో పాల్గొనడం ఎంతో అదృష్టం అన్నారు. రామభక్తితో రామకోటి రామరాజు చేస్తున్న ఆధ్యాత్మిక కృషి, అందరిని ఇందులో భాగస్వాములను చేయడం ఆయన రామభక్తి అభినందనీయమన్నారు.





ధాన్యం కోసం రిజర్వు

వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ధాన్యాన్ని ఆరబోసేందుకు వ్యవసాయ క్షేత్రాల్లో కల్లాలు లేకపోవడంతో రైతులు రోడ్లను ఎంచుకుంటున్నారు. కొండపాక మండలంలోని పలు రహదారులపై ధాన్యం కుప్పలు పోయడం ప్రారంభించారు. స్థలం దొరకదనే ఉద్దేశంతో రైతులు ముందస్తుగా రోడ్లపై రాళ్లు, ప్లాస్టిక్ బ్యాగులను పెడుతూ రిజర్వు చేసుకుంటున్నారు. ఇలా రహదారుల పొడవునా రాళ్లు దర్శనమిస్తున్నాయి.

-కొండపాక, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి)

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలిరావాలి

● ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి



గజ్వేల్ రూరల్ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్/జగదేవ్‌పూర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో గత పదేళ్లు స్వర్ణయుగమని ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ సందర్భంగా గురువారం గజ్వేల్ పట్టణం, జగదేవ్‌పూర్‌లో సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభ పార్టీకి ప్రతిష్టాత్మకమని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుండెల్లో రైళ్లు పరిగెత్తించే విధంగా సభ ఉంటుందన్నారు. గజ్వేల్ రూరల్ మండల నుంచి ఉప్పెనలా గులాబీ దండు కదలాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బెండే మధు, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, మాజీ జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, ఆంజనేయులు, అశోక్‌కుమార్, రాజిరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, బొల్లారం ఎల్లయ్య, గుండా రంగారెడ్డి, యాదవరెడ్డి, రాచర్ల నరేష్‌గుప్త, బుద్ద నాగరాజు, ఉపేందర్‌రెడ్డి, కిరణ్‌గౌడ్, దుర్గయ్య, చల్లా బాలకిషన్, యశ్వంత్‌రెడ్డి, చంద్రశేఖర్‌గుప్త, మాసపాక యాదగిరి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

‘అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు పట్టించాలి’



చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

సిద్దిపేట రూరల్/మద్దూరు/గజ్వేల్ రూరల్/సిద్దిపేట అర్బన్, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి) : అప్పుడే పుట్టిన శిశువుకు తల్లి ముర్రుపాలు పట్టాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసంత సూచించారు. గురువారం నారాయణరావుపేట మండలం జక్కాపూర్ గ్రామంలో పోషణ పక్షోత్సావాలు, గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పిల్లలకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. మద్దూరు మండల స్థాయి కార్యక్రమాన్ని లద్నూరు రైతు వేదికలో నిర్వహించారు. సీడీపీవో రమాదేవి, తహసీల్దారు రహీం, ఎంపీడీవో రాంమోహన్ తదితరులు హాజరై గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అంతకు ముందు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామ సెక్టార్ పరిధిలో పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు ఒక పూట సంపూర్ణ భోజనం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్య కోరారు. సిద్దిపేట అర్బన్ మండలం బక్రి చెప్యాల, ఎన్సాన్‌పల్లి, నాంచార్ పల్లి గ్రామాలలోని అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు గురువారం అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు గర్భవతులకు పౌష్టికాహారంపై సీడీపీవో శారద అవగాహన కల్పించారు. అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

బెజ్జంకి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుగ్గిళ్ల, గాగిల్లాపూర్ గ్రామాల్లో ఉపాధి హామీ పనులను గురువారం డీఆర్డీవో పీడీ జయదేవ్ ఆర్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనులకు కూలీలు ఎక్కువగా వచ్చేటట్లు చూడాలన్నారు. పనులు జరిగే చోట వసతులు కల్పించాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్స్ దుస్తుల పీస్ వర్క్ కటింగ్‌ను పరిశీలించారు.

‘అంబేడ్కర్‌ను రాజకీయాలతో ముడిపెట్టకూడదు’

మిరుదొడ్డి,ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి):డాక్టర్‌బీఆర్ అంబేడ్కర్ జయంతిని రాజకీయాలతో ముడిపెట్టడం సరికాదని తెలంగాణ ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. గురువారం దుబ్బాక మండలం తిమ్మాపూర్‌లో ఆయన మాట్లాడారు. ఈ నెల 13న దౌల్తాబాద్ మండలం ముభారస్‌పూర్‌లో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి పాల్గొని జెండాను పైనుంచి కింద ఉన్న యువకుడికి ఇచ్చారన్నారు. కాంగ్రెస్ నాయకులు సోషల్‌మీడియాలో జెండాను కిందవేసినట్టు ట్రోల్‌చేయడం సరికాదన్నారు. దుబ్బాకలో మాలమహానాడు రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు ర్యాకం శ్రీరాములు కూడా దీన్ని ఖండించారు.

కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

● జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి

మిరుదొడ్డి, ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందించుకోవాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మిరుదొడ్డి మండలం కొండాపూర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. అనంతరం మండలంలోని లింగుపల్లి, చెప్యాలలోని పాఠశాలలను సందర్శించారు.

ఉద్యోగ విరమణ పొందిన బాల్‌రెడ్డికి వీడ్కోలు

కోహెడ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శనిగరం ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు బాల్‌రెడ్డి పదవీ విరమణ పొందగా గురువారం ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. జిల్లా సెక్టోరియల్ అధికారి రంగనాథ్ హాజరై మాట్లాడారు. అనంతరం బాల్‌రెడ్డి దంపతులను బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎం.సరళ, సెక్టోరియల్ అధికారి భాస్కర్, మండల విద్యాధికారి రాళ్ల బండి పద్మయ్య, హెచ్‌ఎం ఎండీ మహమూద్, ఎస్.పద్మ తదితరులు పాల్గొన్నారు.

గూడు.. గోడు..!

(3వ పేజీ తరువాయి)

కొంచెం ఆర్థికంగా ఉన్న 166 మంది ఇటీవలే బెస్‌మెంట్ లెవల్ పూర్తి చేశారు. సిద్దిపేట జిల్లాలోని సిద్దిపేట రూరల్ మండలానికి చెందిన గోపగాని లచ్చవ్వ, కోహెడ మండలం, పోరెడ్డిపల్లి గ్రామానికి చెందిన దబ్బెట రాజవ్వ బెస్‌మెంట్ లెవల్ పూర్తి చేసినందుకు, ఇద్దరికీ ఈ నెల 15న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల చేతుల మీదుగా రూ. లక్ష చొప్పున చెక్కులను అందజేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి నాలుగు విడతల్లో రూ. 5 లక్షలు ప్రభుత్వం అందించనున్నది. వీటిలో బేస్‌మెంట్ లెవల్‌కు రూ.లక్ష, స్లాబ్‌కు రూ.2లక్షలు, గోడలకు రూ. లక్ష, మొత్తం పూర్తి చేశాక రూ.లక్ష అందించనున్నది. స్థలం లేని వారికి స్థలం అందించడంతో పాటు రూ. 5 లక్షలను విడతల వారీగా అందించనున్నది.

ఇంకా కొలిక్కి రాని వైనం

నియోజకవర్గానికి 3500 చొప్పున ఇళ్లను కేటాయించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించగా, దరఖాస్తులు పోటెత్తడంతో ఎవరికి ఎన్ని ఇవ్వాలోనని కొన్ని నెలలుగా అధికారులు తర్జన భర్జన పడుతున్నారు. జిల్లాలో దరఖాస్తులను స్వీకరించి నెలలు గడుస్తున్నా అర్హులేవరు, నియోజకవర్గానికి కుల ప్రాతిపదికన ఎన్ని ఇవ్వాలలోనని మదనపడుతున్నారు. ఇంకా నియోజకవర్గానికి ఎవరికేన్ని అని హౌజింగ్ అధికారులను వివరణ కోరగా ఉంకా కొలిక్కి రాలేదని ఈ నెల చివరి లోపు అర్హుల పేర్లు ప్రకటించే అవకాశం ఉన్నట్లు చెప్పారు. ఒకవేళ అర్హులుగా పేరు వస్తే కేటాయింపుల్లో ఇన్‌చార్జి మంత్రి సూచన మేరకు కలెక్టర్ ఆమోదం తెలిపితేనే ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు చేపట్టనున్నారు. మరికొన్ని రోజుల్లో అర్హులు ఎవరో, అనర్హులు ఎవరో తెలిసే అవకాశమున్నది.

పారదర్శకంగా అమలు చేస్తాం



త్వరలోనే సిద్దిపేటలోని ఆయా నియోజకవర్గాల్లో అర్హులెవరనేది తేలుస్తాం. లక్షల్లో దరఖాస్తులు రావడంతో కొంత ఆలస్యమవుతున్నది. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇల్లు అందేలా పారదర్శకంగా పనిచేస్తున్నాం. ఎవరూ కూడా ఆందోళన చెందొద్దు. అందరికీ విడతల వారీగా ఇళ్లను నిర్మించేందుకు పథకం కింద ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందజేస్తాం.

-దామోదర్‌రావు, పీడీ హౌసింగ్ కార్పొరేషన్, సిద్ది పేట జిల్లా

ఘనంగా ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం



● హాజరైన అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

● అలరించిన విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు



సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థినులు పట్టుదలతో చదివి ఉన్నతమైన ఉద్యోగం సాధించాలన్నారు. అప్పుడే మన మాటకు గౌరవం, ప్రాధాన్యత ఉంటుందన్నారు. అంతకుముందు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మనోహర్ పాఠశాల వార్షిక నివేదక చదివి వినిపించారు. విద్యార్థులు సాధించిన విజయాలను తెలియజేశారు. విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన సైక్లింగ్ విద్యార్థినిలను గరిమా అగ్రవాల్ అభినందించారు. జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, సెక్టోరియల్ ఆఫీసర్ రామస్వామి, జిల్లా సైన్స్ అధికారి కల్లెపల్లి శ్రీనివాస్, మండల విద్యాధికారి రాజ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందించిన మంత్రి పొన్నం



క్రీడాకారులతో మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్‌రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 11, 12, 13న సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో మహనీయుల వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో పోతారం(ఎస్) కృష్ణ కబడ్డీ క్లబ్ క్రీడాకారులు విజయం సాధించారు. గురువారం ఆ క్రీడాకారులను, కోచ్ మడక కృష్ణను మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు.

ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించాలి

● సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వెంకట్ మావో



చేర్యాల వ్యవసాయమార్కెట్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

చేర్యాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొంగరి వెంకట్‌మావో అన్నారు. చేర్యాల మార్కెట్ యార్డును గురువారం ఆయన సందర్శించి ధాన్యం కాంటా పెట్టాలంటూ ఆందోళన చేపట్టారు. రైతులు ధాన్యాన్ని యార్డుకు తీసుకువచ్చి మూడు వారాలుగా పడిగాపులు పడుతున్నా కొనుగోలు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. గన్నీసంచుల కొరత తీర్చి వెంటనే తూకం వేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బోయిన మల్లేశం, ముస్త్యాల ప్రభాకర్, మల్లయ్య, కనకయ్య, బుట్టి మల్లయ్య, నర్సవ్వ తదితరులు పాల్గొన్నారు.

● ధూళిమిట్ట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల్లో వెంటనే వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలనీ సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చొప్పరి రవికుమార్ మాట్లాడుతూ రైతులు వడ్లను కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తున్నా కొనుగోలు చేపట్టకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అకాల వర్షాలకు ధాన్యాం తడిసి ముద్ద అవుతుందన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి పోతిరెడ్డి రాజు, చొప్పరి ప్రసాద్, రాములు, మహేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో సీఎంఆర్ఎఫ్ పక్కదారి

● కాంగ్రెస్ కొమురవెల్లి మండల అధ్యక్షుడు శ్రీనివాస్



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న శ్రీనివాస్

చేర్యాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో సీఎంఆర్ఎఫ్‌ను పక్కదోవ పట్టించి పేదలకు తీవ్ర అన్యాయం చేశారని కాంగ్రెస్ కొమురవెల్లి మండల అధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్ అన్నారు. కొమురవెల్లి మండలం గౌరాయపల్లి గ్రామానికి చెందిన నర్ర రాములమ్మకు రూ.60వేలు, ఇంద్రపురి చంద్రశేఖర్‌కు రూ.45వేలు, కల్పనకు రూ.34వేలు చొప్పున మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మల్లన్న ఆలయ ధర్మకర్త లింగంపల్లి శ్రీను, మాజీ ఎంపీటీసీ లింగంపల్లి కవిత, నాయకులు లింగంపల్లి కనకరాజు, రేష్మబేగం, వెంకట నర్సింహ్మారెడ్డి, ఎల్లయ్య, కాయిత శ్రీనాథ్ రెడ్డి, ఏర్పుల రాజు, చింతల రమేశ్, మాట్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న కేంద్రం



కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చిన్నకోడూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం కాంగ్రెస్ అగ్రనేతలపై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని కాంగ్రెస్ నాయకులు మీసం మహేందర్ యాదవ్ ఆరోపించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో దాఖలు చేసిన చార్జ్ షీట్‌లో కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లను చేర్చడాన్ని నిరసిస్తూ గురువారం చిన్నకోడూరులో కాంగ్రెస్ నాయకులు కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేసి నినాదాలు చేశారు. కాంగ్రెస్ పార్టీకి వచ్చిన ప్రజాదరణను చూసి జీర్ణించుకోలేక ఈడీ కేసులతో ఇబ్బందులు పెడుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొరిమి రాజు, బత్తిని గణేష్, రాజేష్, భూపతిరెడ్డి, రాజు, ప్రశాంత్, జయంత్, కనకరాజు, రాజు, రాకేష్, వేణు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సాగునీరు అందించాలి : బీజేపీ



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

అక్కన్నపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు రామంచ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ 2007లో దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారని, ఇంతవరకు పనులు పూర్తి చేయలేదని ఆరోపించారు. ఇప్పటికైనా మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి గౌరవెల్లి ప్రాజెక్టు భూ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని పనులు పూర్తి చేయాలన్నారు. బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ వేణుగోపాలరావు, నాయకులు నరేష్, చెరుకు సంపత్, మోహన్ నాయక్, గుగులోతు తిరుపతి నాయక్, రైనా నాయక్ పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

● గజ్వేల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ

గజ్వేల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని గజ్వేల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ అన్నారు. గజ్వేల్ పట్టణంలోని జిల్లా ఆసుపత్రిలో ఆర్వీఎం కళాశాల బీఎస్సీ నర్సింగ్ విద్యార్థినులకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. తల్లి పాలపై నర్సింగ్ విద్యార్థులు పరిశోధన నిర్వహించడం కీలకమన్నారు. నర్సింగ్ విద్యార్థులు చదువుతున్న దశలోనే తల్లి పాల గురించి తెలుసుకుంటే వాటి ప్రాముఖ్యతను భవిష్యత్తులో బాలింతలకు వివరించే అవకాశం ఉంటుందన్నారు.